క్లుప్తంగా

ఆమ్‌ఆద్మీని చీపురుతో ఊడ్చేశారు



విలేకరులతో మాట్లాడుతున్న కోన

మండపేట: ఆమ్‌ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు చీపురుతో ఊడ్చేసి అభివృద్ధికి పట్టం కట్టారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో కమలం వికసించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేశ ప్రజలందరు ప్రధాని నరేంద్రమోదీ పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. దేశం రక్షణలోను, దేశాభివృద్ధిలోను, సంక్షేమంలోను నరేంద్రమోదీ కృషి అనిర్వచనీయమన్నారు. దేశం ప్రజలంతా బీజేపీకి అండగా నిలబడ్డారనడానికి ఢిల్లీ ఎన్నికలు ఉదాహరణ అన్నారు.

బీజేపీ నేతల సంబరాలు

కాజులూరు: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో మండలంలోని ఆ పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. దుగ్గుదుర్రులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణమూర్తి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అఖండ విజయం అందించిన ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రొక్కాల సత్తిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి తలాటం అమ్మాజీ, జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మి, దేవు పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబానికి పరామర్శ



ఎస్సై మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేత రాజశేఖర్

కె.గంగవరం: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న తణుకు రూరల్ ఎస్సై మూర్తి కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ వట్టికూటి సూర్యచంద్ర రాజశేఖర్ పరామర్శించారు. కె.గంగవరంలోని ఎస్సై మూర్తి స్వగృహంలో ఆయన తండ్రి గోపాలరావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మూర్తి చిన్ననాటి నుంచి బాగా చదువుకొని ఎస్సై ఉద్యోగం సంపాదించాడని, ఆయన నేటి యువతకు ఆదర్శంగా ఉన్న తరుణంగా ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు.

సాయివెంకట్‌కు ప్రధాని నుంచి అభినందన లేఖ

కె.గంగవరం: మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మల్లిపూడి సాయి వెంకట శ్రీగణేష్ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి అభినందన లేఖ పొందాడు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గణేష్ గతేడాది సెప్టెంబర్‌లో గుజరాత్‌లోని ప్రధాన మంత్రి చదివిన పాఠశాలలో విద్య ప్రాముఖ్యత అనే అంశంపై శిక్షణ పొందాడు. ఈ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ప్రధాన మంత్రి నుంచి నేరుగా అభినందన లేఖ పొందాడు. జిల్లా నుంచి ఎంపికై ప్రధాన మంత్రి నుంచి అభినందన లేఖ పొందిన గణేష్‌ను హెచ్ఎం ఎన్.రాజు, ఎంఈఓ నాగరాజు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు అభినందించారు.

సలాది అప్పారావుకు సతీ వియోగం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు సతీమణి సూర్యకాంతం (65) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు శ్రీనివాసనాయుడు, కుమార్తె రమ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఫోన్లో అప్పారావును పరామర్శించారు. సూర్యకాంతం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. తాను రాజకీయ రంగ ప్రవేశం చేసిననాటి నుంచి అప్పారావు, సూర్యకాంతం కుటుంబం తనకు అండగా నిలుస్తూ వస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఫోన్లో పరామర్శించారు. గ్రామ ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, గ్రామస్తులు మాకా బాబ్జీ, సుంకర వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, సలాది చిన్నీ తదితరులు సూర్యకాంతం మృతికి నివాళి అర్పించారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

అంబాజీపేట: ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యం కావడంతో అంబాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిరతపూడి శివారు లంకవారిపేటకు చెందిన తవిటికి నాగమణి (78) ఈ నెల 5న ఆస్పత్రిక వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లింది. నాగమణి ఎప్పటికీ రాకపోడంతో అమలాపురం ఆస్పత్రులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించక పోవడంతో ఈ నెల 7న ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. వృద్ధురాలి కుమారుడు ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

చివరికి సాగునీటి సమస్య

- రబీ పంటకు సక్రమంగా అందని సాగునీరు
- నెల రోజులకే వంతుల వారీగా సరఫరా
- పొదుపుగా వాడుకోవాలంటున్న అధికారులు
- సాగునీటి వినియోగంలో శాస్త్రీయ పద్ధతి అవసరం
- రెండు నియోజవర్గాల్లో 98,656 ఎకరాల సాగు



కపిలేశ్వరపురం: రబీలో సాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదు. రైతులు ఏటా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రబీ సాగవుతోంది. పంటకు నీరు అత్యంత అవసరం. నీటి సరఫరాలో సమస్యలు ఎదురైనప్పుడల్లా కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరు, వెదురుమూడి, వాకతిప్ప, టేకి తదితర గ్రామాల్లోని శివారు భూములకు సమస్య తలెత్తుతోంది. రెండు నియోజకవర్గాల్లో జనవరి మొదటి వారం నుంచి రబీ నాట్లు ప్రారంభించారు. పంట కోతకు సుమారుగా 130 రోజులు పడుతుంది. చివరి వరకూ సాగునీరు అవసరముంటుంది. నాట్లు వేసి నెల రోజులు కూడా పూర్తవ్వకుండానే సాగునీటి సరఫరా యాజమాన్యంలో భాగంగా తూర్పు, మధ్య డెల్టాల్లో ఈ నెల మొదటి వారం నుంచి వంతుల వారీ విధానాన్ని అమలు చేస్తున్నారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం తగ్గితే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా వరి పంటకు సాగునీరు ఎంత అవసరం అనే దానిపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయా శాఖాధికారులంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల పరిధిలో సాగునీటి సరఫరా తీరుతెన్నులపై ఈ కథనం..

రెండు నియోజకవర్గాల్లో సాగు ఇలా

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీ మీటర్లు నీరు అవసరం. రామచంద్రపురం నియోజవర్గంలో 75 గ్రామాల్లో 52,836 ఎకరాలకు 6,60,45,000 మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లో 45,820 ఎకరాలకు 5,72,75,000 మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 98,656 ఎకరాలకు 11,58,33,750 మిల్లీ మీటర్ల సాగునీరు అవసరమవుతుంది.

క్షేత్ర స్థాయిలో వరి సాగు నీటి అవసరం ఇలా..

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	అవసరమైన నీరు (మి.మీటర్లలో)
రామచంద్రపురం	25	18,236	2,27,95,000
కె.గంగవరం	26	15,620	1,95,25,000
కాజులూరు	26	18,980	2,37,25,000
మండపేట	12	15,200	1,90,00,000
రాయవరం	12	14,580	1,82,25,000
కపిలేశ్వరపురం	19	15,770	1,97,12,500
మొత్తం	120	98,656	1,23,320,000

పల్లపు భూముల రైతులను దృష్టిలో ఉంచుకోవాలి



ఎగువ భూములున్న రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండడంతో పల్లపు రైతులకు సమస్య ఎదురవుతోంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులొస్తాయి. దిగువనున్న రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని మసలుకోవాలి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరును పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగానూ, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటిమీటర్లు నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకూ 5 సెంటీమీటర్ల నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

– కేవీఎస్ రమేష్ కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం మండలం

కల్యాణం.. కమనీయం

- కన్నుల పండువగా భీమేశ్వరస్వామి కల్యాణోత్సవం
- వీక్షించిన వేలాది మంది భక్తులు
- వైభవంగా స్వామివారి గ్రామోత్సవం



ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి కల్యాణ వేడుకకు పసుపు దంచుతున్న ముత్తైదువులు



ద్రాక్షారామలో స్వామివార్ల ఊరేగింపు



ప్రసాద్, లక్ష్మీరాజ్యం దంపతులు సిద్ధం చేసిన కల్యాణ కొబ్బరి బొండాలు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. కల్యాణాన్ని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, చండికాదేవి సమేత సూర్యేశ్వరుడు, లక్ష్మీదేవి సమేత నారాయణస్వామివార్లను కల్యాణ మూర్తులను గావించి పెండ్లికుమార మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని నేతృత్వంలో అర్చకులు కల్యాణ మూర్తులకు ఎదుర్కోలు సన్నాహాలు నిర్వహించారు. ముత్తైదువలు ఆలయంలో పసుపు కొమ్ములను కొట్టి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు, సూర్యనారాయణరెడ్డి, ఉమాదేవి దంపతులు, సత్తిరెడ్డి, శ్రీకాంతలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించారు. మధ్యాహ్నం కాలార్చన, రాజభోగ నివేదన నిర్వహించారు. సాయంత్రం దేవస్థానం బ్రహ్మ దేవుల పల్లి ఫణిరామకృష్ణ ఆధ్వర్యంలో పండితులు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను పూర్తి చేశారు. స్వామివార్లకు నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు, వేలాది మంది భక్తుల నడుమ గ్రామోత్సవం వైభవంగా సాగింది. రాత్రి 11.05 గంటలకు పండుతులు స్వామివార్లకు కల్యాణం జరిపించారు.



ముగ్గురు దేవుళ్లను కల్యాణ మూర్తులను గావిస్తున్న ఆలయ వైదిక బృందం

13 ఏళ్లుగా కొబ్బరి బొండాల సమర్పణ

ద్రాక్షారామకు చెందిన ప్రగళ్లపాటి మల్లికార్జునప్రసాద్, లక్ష్మీరాజ్యం దంపతులు గత 13 సంవత్సరాలుగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణానికి కల్యాణం కొబ్బరి బొండాలు సమర్పిస్తున్నారు. ఏటా వినూత్నంగా, సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణ కొబ్బరి బొండాలను అందజేస్తున్నారు.

శోభాయమానంగా జనార్దనుడి రథోత్సవం



మండపేటలో స్వామి వారి రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన మండపేట
- విశేషంగా భక్తజన సందోహం

మండపేట: శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామివారి రథోత్సవం మండపేట పట్టణంలో కనుల పండువగా జరిగింది. జనార్దన అగస్త్యేశ్వర స్వామివార్ల దేవస్థానంలో స్వామివారికి కల్యాణ ఘట్టం అనంతరం శనివారం నిర్వహించిన రథోత్సవం శోభాయమానంగా సాగింది. ఆలయ ఈవో కామేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి గోపాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ కృతువు, రథోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణలతో రథం చుట్టూ మూడు ప్రదక్షిణలు అనంతరం ఉత్సవమూర్తులను రథంపై ఆశినులు చేసి ప్రారంభించారు. రథోత్సవం పట్టణంలోని అన్ని వీధుల్లో సాగింది. పట్టణమంతా గోవిందనామ స్మరణలతో మార్మోగిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు రత్నాలరావు, శ్రీధర్‌ల పర్యవేక్షణలో సిబ్బంది విద్యుత్ సేవలు అందించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. కలువపువ్వు సెంటర్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొండెక్కిన కోడ్



రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయానికి సమీపంలో మంత్రి సుభాష్ భారీ కటౌట్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 27న జరగనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అమలులో ఉన్న ఎన్నికల కోడ్ అభాసుపాలవుతోంది. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు అధికార టీడీపీకి సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్‌ల విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఎన్నికల కోడ్‌ను అపహాస్యం చేస్తున్నారు. ఎన్నికల అధికారిగా బాధ్యతలు వహిస్తున్న ఆర్డీఓ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ప్రధాన రహదారిపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భారీ కటౌట్ ఎన్నికల ప్రక్రియను వెక్కిరిస్తోంది. కొసమెరుపు ఏంటంటే గతంలో ఎన్నికల వేళ నిబంధనలు మీరితే పౌరులు ×సీ విజిల్× అనే యాప్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేవారు. ప్రస్తుతం సీ విజల్ యాప్ తెరుస్తుంటే ప్రస్తుతం మీ ఏరియాలో ఎటువంటి ఎన్నికలు లేవని మెసేజ్ రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.



రామచంద్రపురం పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రవేశ ద్వారం



రామచంద్రపురంలో టీడీపీ కార్యాలయం వద్ద ఇలా..

28 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



రాట ముహూర్తం చేస్తున్న శ్రీవారి భక్త మండలి

గ్రామంలో రాటముహూర్తం చేసి ఉత్సవాలకు శ్రీకారం

మండపేట: అర్తమూరులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి ఆరంభంకానున్నాయి. ఈ ఉత్సవాలకు గ్రామంలో శనివారం రాట ముహూర్త చేసి, ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. శ్రీవారి భక్త మండలి కన్వీనర్ కర్రి బాపిరెడ్డి, చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను పంచిపెట్టారు. ఈ నెల 28 మొదలుకొని వచ్చే నెల 6వ తేదీ వరకూ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు భక్త మండలి సభ్యులు వుద్దగిరి ఆంజనేయులు, మండ వెంకటరెడ్డి, వెలగల శివారెడ్డి, కోనాల సత్తిరెడ్డి, సత్తి వీరెడ్డి, తాడి రామారెడ్డిలు తెలిపారు. గొలుగూరి శ్రీనివాసరెడ్డి శ్రీదేవి దంపతులు ప్రధాన యాజమాన్య దంపతులుగా శ్రీమాన్ కాండూరి వెంకట రమణాచార్యులు, మరింగంటి వరదాచార్య స్వామి, గూడూరి గోపాలచార్యులు, గూడూరి కేశవాచార్యులు, ముడుంబై నరసింహాచార్యుల నేతృత్వంలో ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తీర్థం



నర్సిపూడిలో తులసిమాలలతో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

పి.గన్నవరం: చిన అంతర్వేదిగా పేరొందిన ఊడిమూడిలోని లక్ష్మీ నరసింహస్వామి వారి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం అశేష భక్త కోటి అత్యంత భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని జరుపుకొన్నారు. దీంతో అన్ని గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన ఆలమూరు మండలంలోని చింతలూరులో వేంచేసిన ఉత్తర ముఖద్వార శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలోని దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత జనార్దనస్వామి వారి ఆలయాల్లో వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తడంతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. అలాగే ఆయా గ్రా మాల్లో వైష్ణవాలయాల ప్రధాన అర్చకులందరూ దేవతామూర్తుల విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు.

11న మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

కె.గంగవరం: కోటిపల్లిలో వేంచేసిన సోమేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 11వ తేదీన మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భీమశంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా మహాశివరాత్రికి కోటిపల్లిలోని సోమేశ్వరస్వామి ఆలయానికి సుమారు లక్షన్నర మంది భక్తులు వస్తారన్నారు. ఈ ఏడాది కూడా భారీగా భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దేవదాయ, ధర్మాదాయశాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లను ఈ సమావేశంలో వివరించాలన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు పూర్తి నివేదికతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎరువుల యాజమాన్యంపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. మండలంలోని చేదువాడ, శీల, మంజేరు తదితర గ్రామాల్లో పంట పొలాలను శనివారం ఆయన సందర్శించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడటం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. పంటలకు సోకే తెగుళ్ల, వాటి ఉధృతికి అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు.

ఘనంగా ఖండేశ్వరస్వామి కల్యాణం

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలోని ఖండేశ్వర స్వామి కల్యాణ ఉత్సవం శనివారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకంఠం అమ్మన్న ఆధ్వర్యంలోని అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. కొమాళ్లపల్లి శ్రీనివాస రామ గోపాల్ బ్రహ్మత్వంలో స్వామి కల్యాణ పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఆలయంలో నిత్యహోమ పూజలు చేయనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



స్వామివారి కలాలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆలయ ఈఓ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఇటీవల చదువుల పండుగ పేరుతో నిర్వహించిన స్వామి చెంత ఉంచిన లక్ష కలాలను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు పంపిణీ చేశారు. విద్యార్థులు తరలివచ్చి స్వామివారిని దర్శించి, స్వామివారి పాదాల చెంత ఉంచిన కలాలను తీసుకున్నారు.

పోటెత్తిన భక్తులు

భీష్మ ఏకాదశి సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక అభిషేకాల్లో, శ్రీలక్ష్మీగణపతిహోమంలో 91 మంది భక్తులు పాల్గొన్నారు. చిన్నారుల అక్షర్యాభాసాల్లోను, అన్నప్రసాద, తులాభారం వంటి కార్యక్రమాల్లో 157 మంది చిన్నారులు పాల్గొన్నారు. స్వామివారి అన్నప్రసాదాన్ని 6530 మంది భక్తులు స్వీకరించారు. స్వామివారికి శనివారం ఒక్క రోజు రూ.4,29,769 వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా ఆదాయం సమకూరినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాలు, టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,39,100, అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.25,392తో మొత్తం రూ.1,64,492 ఆదాయం వచ్చినట్లు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

వైభవంగా లంక సానమ్మ ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీలంక సానమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తాతపూడి రహదారిలోని ఆలయం వద్ద భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో గ్రామస్తులు దర్శించుకున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

ఆలమూరు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన చిలుకూరి సత్యనారాయణ రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా తన వంతు సాయంగా దాత సత్యనారాయణ ఈ విరాళాన్ని శనివారం ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వర స్వామి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వంటిపల్లి సతీష్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు అంగర వేణుగోపాలాచార్యులకు అందించారు. దాత కుటుంబీకులను పలువురు గ్రామస్తులు అభినందించారు.